క్లుప్తంగా

క్షేత్ర స్థాయిలో సమస్యలపై సమీక్ష



కపిలేశ్వరపురంలో కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత పంచాయతీ స్థాయి అధికారులంతా కృషి చేయాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పారిశుధ్యం తదితర అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు.

మృతురాలి కుటుంబానికి తక్షణ సాయం



ప్రభుత్వ సాయం అందిస్తున్న బీమా సిబ్బంది

మండపేట: మండలంలోని తాపేశ్వరం ఎస్సీ కాలనీకి చెందిన వీరలక్ష్మి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10,000 వైఎస్సార్ బీమా సిబ్బంది అందజేశారు. కొద్దిరోజులుగా వీరలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. స్థానిక నేతలు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి ప్రభుత్వ సాయం అందించేందుకు అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష మంజూరు కాగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు అందించారు. మిగిలిన రూ. 90000 నామిని అకౌంట్‌కు జమ చేస్తారని బీమా సిబ్బంది తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బూర చిన్న, ధనరాజు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



దంగేరు హైస్కూల్లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారి ప్రవీణ

కె.గంగవరం: ప్రతి విద్యార్థి పరిసరాల విజ్ఞానం, సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారి ప్రవీణ అన్నారు. మండలంలోని దంగేరు ఉన్నత పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన సైన్సు ప్రాజెక్టులు ఆసక్తికరంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు విద్యార్థుల మేధస్సును పెంచడానికి పలు పథకాలు, ప్రోత్సాహకాలకు అందిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని సైన్సులో రాణించాలన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్సు పరిజ్ఞానంలో రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడతాయని తెలిపారు. డీఎస్‌ఓ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సైన్స్ ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పార్టీ శిక్షణ కార్యక్రమానికి మండపేట నేతలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకన్నబాబు

మండపేట: ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల శిక్షణకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా కనివినీ ఎరుగని రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు శిక్షణ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా భవిష్యత్తు కార్యాచరణపై పార్టీ ముఖ్య నేతలు దిశానిర్దేశం చేశారన్నారు. మండపేట నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని గురించి సమావేశంలో తాను వివరించినట్టు వెంకన్నబాబు తెలిపారు. శిక్షణకు జేసీఎస్ కన్వీనర్లు యరమాటి వెంకన్నబాబు, బందెల సాయిరాం, పార్టీ నాయకుడు అబ్బిరెడ్డి వీర్రాజు తదితరులు హాజరయ్యారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోంది ఎవరు?

- ఎవరి స్వార్థం కోసం వివాదాన్ని పెంచుతున్నారు ?
- ఎంపీఎస్ స్కూల్ వివాదంలో రాజకీయ జోక్యంపై ఎమ్మెల్సీ తోట ఫైర్



ఎంపీఎస్ స్కూల్ వివాదంపై మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు

మండపేట: వివాదాన్ని పెంచి స్కూల్‌కు వెళ్లనీయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోంది ఎవరు? పిల్లల్ని రోడ్డెక్కించి లబ్ధి పొందాలని ఎవరు చూస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. స్థానిక ఎంపీఎస్ స్కూల్ వివాదంపై తనపై విపక్ష నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని మీడియా వేదికగా ఆయన తిప్పి కొట్టారు. స్కూల్ భాగస్వాముల మధ్య నెలకొన్న వివాదం పరిష్కారానికి తమ సొంత సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాజుబాబు, డాక్టర్ బిక్కిన గోపాలకృష్ణలతో చేసిన ప్రయత్నాలను మంగళవారం స్థానిక సూర్య గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారితోనే చెప్పించారు.

తొలుత ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పట్టణానికి చెందిన గజ్జరపు శ్రీరామ్, వల్లూరు చిన్నారావు 2000లో చెరో 50 శాతం వాటాపై ఎంపీఎస్ స్కూల్‌ను స్థాపించారన్నారు. తన భార్య తెచ్చుకున్న కట్నం సొమ్ముతో పాటు తన పొలం అమ్మి వచ్చిన మొత్తాన్ని శ్రీరామ్ స్కూల్‌లో పెట్టారన్నారు. 2013లో దురదృష్టవశాత్తు శ్రీరామ్ మృతిచెందగా వచ్చిన ఇన్సూరెన్స్ సొమ్ములు సైతం ఆయన సతీమణి సుభాషిణి స్కూల్ నిర్వహణకు ఇచ్చేశారన్నారు. స్కూల్‌లో 50 శాతం వాటా కలిగిన శ్రీరామ్ మృతితో స్కూల్ సొసైటీలో ఆయన భార్యకు చోటు కల్పించకుండా చిన్నారావు తన సోదరుడు పేరును చేర్చాన్నారు. సుభాషిణికి హాస్టల్ నిర్వహణ అప్పగించారన్నారు. కోవిడ్ సమయంలో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గితే ఆ నెపం ఆమెపై నెట్టి హాస్టల్‌ను మూసివేశారన్నారు. అప్పుడప్పుడూ ఖర్చులకు కొంత మొత్తం ఇవ్వడం తప్ప, లెక్కలు చెప్పడం లేదని, న్యాయం చేయాలని సుభాషిణి మండపేటలో పెద్దల వద్దకు వెళ్లినా ఎవరూ పట్టించుకుంది లేదన్నారు. రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన సుభాషిణి తండ్రి సమస్యను తన వద్దకు తెచ్చారన్నారు. స్కూల్ తప్ప ఏ ఆదరువు లేని తన కుమార్తెకు న్యాయం జరిపించాలని కోరారన్నారు. ఈ విషయమై వారి సొంత సామాజిక వర్గానికి చెందిన బిక్కిన చిన్న, పట్టాభిరామయ్య చౌదరి, డాక్టర్ బిక్కిన గోపాలకృష్ణ, రాజుబాబులతో కలిసి వారి ఇళ్ల వద్ద చిన్నారావు, అతని కుటుంబ సభ్యులతో రెండు సార్లు మాట్లాడామన్నారు. టర్నోవర్‌పై 40 శాతం వరకు లాభం వస్తుందని ఆ మేరకు పంపకాలు చేయాలని సుభాషిణి కోరినట్టు ఎమ్మెల్సీ తోట తెలిపారు.

డాక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇరువురు భాగస్వాములతో జరిపిన చర్చల్లో స్కూల్ టర్నోవర్‌పై 40 శాతం లాభం రాదని, 25 శాతం లాభాలు పంచేందుకు చిన్నారావు చెప్పిన మాటలకు సుభాషిణి అంగీకరించారన్నారు. ఇప్పటివరకూ స్కూల్ నిర్వహణ చిన్నారావు చేయగా వచ్చే ఎనిమిదేళ్లు సుభాషిణికి అప్పగించాలన్న షరతుకు చిన్నారావు కుటుంబ సభ్యులు అంగీకరించడంతో అగ్రిమెంట్ సిద్ధం చేసినట్టు తెలిపారు. తర్వాత సంతకాలు పెట్టే సమయంలో వారు మాట మార్చారన్నారు. పట్టాభిరామయ్య చౌదరి, రాజుబాబు మాట్లాడుతూ స్కూల్ ఎవరొకరు సొంత చేసుకునేలా వేలం నిర్వహించాలని చిన్నారావు కుటుంబ సభ్యులు కోరగా ఇప్పటి వరకు టర్నోవర్‌లో 40 శాతం లాభం లెక్కించి, స్కూల్ విలువ లెక్కకట్టే బాధ్యతను చిన్నారావుకే అప్పగించామన్నారు. వారు అందుకు అంగీకరించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సుభాషిణి స్కూల్‌లోకి ప్రవేశించారన్నారు. 50 శాతం వాటా కలిగిన సుభాషిణి స్కూల్‌లో కూర్చుంటే తప్పేమిటని వారు ప్రశ్నించారు. ఇప్పటి వరకు స్కూల్ అకౌంట్ నిర్వహణలో కొన్ని తప్పులు తాను గుర్తించినట్టు పట్టాభిరామయ్య చౌదరి తెలిపారు. ఒంటరి పోరాటం చేస్తున్న భర్త లేని మహిళకు అండగా నిలవాల్సింది పోయి ఆమెపై నిందలు మోపడం సరికాదని విపక్ష నేతలకు హితవు పలికారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞతతో ఆలోచించాలని, ప్రతిపక్ష కుట్ర రాజకీయాలకు చిన్నారుల భవిష్యత్తు పాడుచేయవద్దన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నేత వేగుళ్ల లీలాకృష్ణలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం స్కూల్ తెరవకుండా అడ్డుకుంటున్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు.

స్కూల్ తెరవాలని కలెక్టర్‌కు ఎమ్మెల్సీ తోట ఫోన్

విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఎంపీఎస్ స్కూల్‌ను వెంటనే తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షుశుక్లాను ఎమ్మెల్సీ తోట కోరారు. మీడియా ముందు ఆయన కలెక్టర్ ఫోన్ చేసి సమస్యను వివరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, శెట్టిబలిజ సంఘం కన్వీనర్ పంపన శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్ పాల్గొన్నారు.

గవర్నింగ్ బాడీ అధీనంలోకి ఎంపీఎస్ స్కూల్

- కలెక్టర్ ఉత్తర్వుల జారీ

మండపేట: భాగస్వాముల మధ్య నెలకొన్న వివాదంతో కొద్ది రోజులుగా మూసి ఉన్న మండపేట పబ్లిక్ స్కూల్‌ను నిర్వహణ బాధ్యతలను గవర్నింగ్ బాడీకి అప్పగిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ స్కూల్లో సుమారు 1400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మేనేజ్‌మెంట్ వివాదంతో దసరా సెలవుల తర్వాత స్కూల్ ఇంకా తెరుచుకోలేదు. మేనేజ్‌మెంట్‌లోని ఒకరు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్టు తెలిసింది. కాగా విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలుగకుండా కలెక్టర్ చర్యలు చేపట్టారు. ప్రస్తుత పాలక మండలిని పాఠశాల నిర్వహణలో జోక్యం చేసుకోకుండా ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేశారు. రామచంద్రపురం ఆర్డీఓ చైర్మన్‌గా డీఎఈఓ, మండపేట ఎంపీడీఓ, జిల్లా కోపరేటివ్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి సభ్యులుగా గవర్నింగ్ బాడీని నియమిస్తూ ఆదేశాలిచ్చారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి స్కూల్ నిర్వహణ చేయనున్నట్టు ఎంఈఓ రామచంద్రరావు తెలిపారు.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశానికి హాజరైన మంత్రి వేణు, కన్వీనర్లు, గృహ సారథులు

కె.గంగవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజల్లోని తీసుకువెళ్లేందుకు గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు సిద్ధమవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురాం పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో మంగళవారం ×ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే৷ అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు రఘురాం మాట్లాడుతూ పార్టీ నిర్దేశించిన సమయంలో మండలంలోని ఒక్క గ్రామం ఎంచుకుని ఆ గ్రామంలో పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు, ఇతర ప్రజాప్రతినిధులు సమన్వయంగా పని చేసి 20 గృహాలను సందర్శించాల్సి ఉంటుందన్నారు. ఆ గృహాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వారికి జరిగిన మేలు గురించి వివరించాలని అనంతరం సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామం మొత్తంగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను పొందుపరచాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు. మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని వాటిని ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాలను తిప్పి కొట్టేందుకు ప్రతి కార్యకర్త, నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. పార్టీ ఆదేశించిన పనిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేస్తే భవిష్యత్తులో మంచి జరుగుతుందని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ తోకల శ్రీను, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, పార్టీ నాయకులు పంపన సుబ్బారావు, బత్తుల అప్పారావు, ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి



యువనగర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మగళవారం మంత్రి వేణు పట్టణంలోని శీలంవారిసావారం, యువనగర్, రైలు గట్టు తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుని వారి నుంచి వినతులు స్వీకరించారు. డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సదుపాయాలపై ఆయా ప్రాంతాల ప్రజలు మంత్రికి వినవించారు. తదనంతరం మంత్రి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పట్టణంలో కచ్చా డ్రైన్లను సీసీ డ్రైనేజీలుగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించేందుకు రూ.12 కోట్లతో తాగునీటి పైపులైను నిర్మాణం చేపడుతున్నామన్నారు. పట్టణంలో స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు, ఎలక్ట్రికల్ ఏఈ ఎంవీ రమణ, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు కేతా శ్రీను, వాడ్రేవు సాయి ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

ఆలమూరు: ఖరీఫ్‌లో పండించిన ప్రతీ గింజను కనీస గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులకు అన్ని విధాలా సహాయ, సహకారాలను అందిస్తామని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాసూళ్లు చేసిన ధాన్యాన్ని సత్వరమే రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకుని అధిక ధరను పొందాలని సూచించారు. వారం రోజుల వ్యవధిలోనే కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు జరిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతులకు లబ్ధి చేకూర్చేందుకు రైతు భరోసా కేంద్రాలు తోడ్పాటు అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఏఓ ఎస్. లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత మనందరి బాధ్యత



పామర్రులో పారిశుధ్య కార్మికులతో కలసి ర్యాలీ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: గ్రామాల్లోని ప్రజలు తామకు తాము ఎలా శుభ్రంగా ఉండడంతో పాటు తమ ఇళ్లను కూడా శుభ్రంగా ఉంచుకుంటారో అదే తరహాలో గ్రామ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపా కృష్ణ కోరారు. మండలంలోని పామర్రులో మంగళవారం స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులతో కలసి గ్రామంలో పారిశుధ్య అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రపరచి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. దీంతో పాటు కూరగాయల వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను ఇంటి పెరట్లో గొయ్యి తీసి వేయాలన్నారు. తద్వారా ఆ వ్యర్థాలు ఎరువుగా మారతాయని వాటిని పంట పొలాలకు, ఇళ్లల్లో ఉండే మొక్కలకు వేయాలని సూచించారు. గ్రామంల్లో పారిశుధ్య కార్మికుల శ్రమను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. ప్రస్తుతం పారిశుధ్య కార్మికుల కొరత ఉందని స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమాన్ని తప్పక చేస్తే తద్వారా పారిశుధ్య కార్మికులకు పనిభారం తగ్గుతుందని తెలిపారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ వాసంశెట్టి సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా అట్లతద్దె

- గౌరీదేవికి మహిళల పూజలు
- ముత్తైదువలకు వాయనాలు



రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం కాలువ వద్ద మహిళల పూజలు



కోలంకలో కాలువ వద్ద గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు



పసలపూడి కాలువ రేవులో వరి దుబ్బులకు పూజ చేస్తున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గవ్యాప్తంగా అట్లతద్దె సందర్భంగా పండగ వాతావరణం నెలకొంది. మహిళలు సోమవారం రాత్రి సంప్రదాయబద్ధంగా గోరింటాకు పెట్టుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున లేచి భోజన అనంతరం నుంచి సాయంత్రం వరకు ఉపవాసాలు చేశారు. కొత్తగా పెళ్లయినవారికి ముత్తైదువుల ఆశీర్వాదాల మధ్య ఇస్తినమ్మా వాయినం, పుచ్చుకుంటినమ్మా వాయినం అంటూ వాయనాలు తీర్చుకున్నారు. అనంతరం పసుపుతో చేసిన గౌరవమ్మలను తీసుకుని వెళ్లి తమకు సమీప కాలువలు, గోదావరుల్లో కలిపారు. సాయంత్రం గ్రామాల్లో చెట్లకు వేసిన ఉయ్యాలలు ఊగుతూ యువతులు, మహిళలు, చిన్నారులు సందడి చేశారు. రాత్రి చందమామను దర్శించుకున్న తరువాత ఉపవాసాన్ని ముగించి అట్లు భుజించి ఉపవాసాన్ని విరమించారు. అట్లతద్దె సందర్భంగా నియోజకవర్గంలోని రామచంద్రపురం పట్టణం, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని దేవాలయాలను మహిళా భక్తులు సందర్శించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా పూజించుకున్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో మంగళవారం అట్లతద్దెను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. సూర్యోదయానికి ముందే మహిళలు నిద్రమేల్కొని తలస్నానాలు చేసి ఆహారం స్వీకరించారు. సాయంత్రం వరకూ కఠిన ఉపవాసం ఉండి రాత్రి నక్షత్ర దర్శనంతో ఉపవాసదీక్ష ముగించారు. కాలువల వద్దకు వెళ్లి గౌరీదేవికి, గంగాదేవికీ, పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని కాలువ వద్ద వరి మొక్కలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. సాయంకాలం పలువురు మహిళలు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మినప, బియ్యంపిండితో అట్లు వేసి మహిళలు పరస్పరం ఒకరికొకరు వాయినాలు సమర్పించుకున్నారు. పలుచోట్ల వృద్ధులు మహిళలకు చిన్నారులకు అట్లతద్దె కథ వినిపించి పండగ ఇతి వృత్తాంతాన్ని తెలిపారు. గ్రామాల్లోని దాదాపు హైందవ మతంలోని ప్రతి స్త్రీ అట్లతద్దె పండగను చేస్తుంటారు.

రాయవరం: అట్లతద్దె పండగను మహిళలు సంప్రదాయ బద్ధంగా మంగళవారం జరుపుకున్నారు. సాయంత్రం సమయంలో మహిళలందరూ కాలువ గట్టు వద్దకు చేరి వరి దుబ్బులకు పూజలు చేసి, గౌరీదేవి పాటలు పాడారు. అధిక సంఖ్యలో మహిళలు సమీపంలోని దేవాలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు చేయడంతో పలు దేవాలయాలు కిటకిటలాడాయి. సాయంత్రం సమయంలో చంద్రున్ని చూసిన అనంతరం మహిళలు ఉపవాస దీక్షను విరమించారు.

అఖండ భారతావనికి ఆద్యుడు పటేల్

- ఎంపీపీ నౌడు వెంకటరమణ
- పలుచోట్ల రాష్ట్రీయ ఏక్తా దివస్



రామచంద్రపురం పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు



రాయవరంలో పటేల్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు



కపిలేశ్వరపురంలో వల్లభాయ్ పటేల్‌కు నివాళి అర్పిస్తున్న ఎంపీడీఓ, ఉద్యోగులు

రాయవరం: స్వాతంత్ర్యానంతరం దేశంలోని అన్ని సంస్థానాలను ఏకం చేసి అఖండ భారతాన్ని ఏర్పాటు చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్దార్ పటేల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ పటేల్ జీవితం నిఘంటువు వంటిదన్నారు. ఎంపీపీ వెంకటరమణ, మాజీ ఎంపీపీ కోట బాబూరావు, మండల పరిషత్ కార్యాలయ ఏవో డి.శ్రీనివాసు, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి తదితరులు వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పటేల్ జయంతిని 'రాష్ట్రీయ ఏక్తా దివస్'గా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పటేల్ జయంతిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పటేల్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

యువతకు ఆదర్శప్రాయం

కపిలేశ్వరపురం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం నేటి యువతకు ఆదర్శ ప్రాయమని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. జాతి ఔన్నత్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఎంవీ ప్రకాష్, సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

రామచంద్రపురం: భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత అన్నారు. మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు నేషనల్ యూనిటీ డే నిర్వహించి పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిన పటేల్ స్వాతంత్ర అనంతరం దేశంలోని సంస్థానాలన్నీ ఏకం చేసి భారత్ ఫెడరేషన్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ, అధ్యాపకులు డాక్టర్ ఎస్వీ రమణ, డాక్టర్ శోభారాణి, డాక్టర్ సుజాత, డాక్టర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పురోభివృద్ధి చెందాలి

అంబాజీపేట: తక్కువ పెట్టుబడులతో ఎక్కువ పంటలను ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించి ఆర్థిక పురోభివృద్ధి చెందాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ జె.ఎలియాజర్ అన్నారు. వక్కలంకలో పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు, మెంటర్‌లు గుత్తుల ధర్మారావు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మాస్టర్ ట్రైనర్ జనిపల్లి నాగవేణి అధ్యక్షతన మంగళవారం సందర్శించారు. ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్ మాట్లాడుతూ పర్యావరణానికి, ఆరోగ్యానికి హాని కలగకుండా నాణ్యమైన ప్రకృతి సేద్య పంటలను పండించేలా రైతులు చైతన్యం కావాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగడమే కాకుండా భూమికి సారవంతమైన ఎరువును అందిస్తారన్నారు. ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర స్థాయి పరిశీలకుడు ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధాన పద్ధతులను పాటించడం ద్వారా చిన్న సన్నకారు రైతులు ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. వ్యవసాయాధికారి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సహజ సిద్ధమైన పంటలు పండించేలా రైతులు ఆలోచనలు చేయాలన్నారు. అంతకుముందు కొబ్బరి, కోకో తోటల్లో కూరగాయల సాగు, తదితర పండించే పంటలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ చంద్రరాజు రైతు క్షేత్ర పాఠశాల గురంచి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ట్రైనీలు వై.నీరజ, సీహెచ్ సంధ్య పాల్గొన్నారు.